క్లుప్తంగా

నిరసన కార్యక్రమం విజయవంతం చేయండి


ఆలూరు సాంబశివారెడ్డి

శింగనమల: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ , ఈనెల 27న నియోజకవర్గ కేంద్రం శింగనమలలో నిర్వహించనున్న కార్యక్రమం విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆలూరు సాంబశివారెడ్డి ఒక ప్రకటనలో కోరారు. ఎన్నికల సమయంలో విద్యుత్ చార్జీలు పెంచమని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన వెంటనే కూటమి ప్రభుత్వం ప్రజలపై భారం మోపిందన్నారు. అధికారంలోకి రావడానికి కూటమి పార్టీలు అబద్ధపు హామీలిచ్చి ప్రజలను మోసం చేశారన్నారు. విద్యుత్ చార్జీల పెంపును వ్యతిరేకిస్తూ విద్యుత్ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమానికి నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు, రైతులు తరలిరావాలని కోరారు.

సీఐకి మిత్రుల సన్మానం


సీఐని సన్మానిస్తున్న స్నేహితుల

తాడిపత్రి రూరల్: స్థానిక అప్‌గ్రేడ్ పోలీసు స్టేషన్‌లో బుధవారం సీఐ శివగంగాధర్‌రెడ్డిని 2002–05 బ్యాచ్‌కు చెందిన ఎన్‌సీపీ మిత్రులు ఘనంగా సన్మానించారు. వివిధ రాష్ట్రాల్లో పలు హోదాల్లో స్థిరపడిన 19 మంది మిత్రులు కలసి సీఐని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు పాత జ్ఞపకాలను నెమరు వేసుకున్నారు. అందరూ తాడిపత్రికి వచ్చి సన్మానించడం గర్వంగా ఉందని సీఐ తెలిపారు. రాబోయే రోజుల్లో కుటుంబ సభ్యులతో కలుస్తామన్నారు. తరచుగా స్నేహితులను కలుసుకుని, వారి అనుభవాలను పంచుకోవడం ద్వారా సంతోషంగా ఉండటంతో పాటు మానసిక రుగ్మతల నుంచి ఉపసమనం కలుగుతుందని స్నేహితుడైన మానసిక వైద్యుడు లక్ష్మన్న తెలిపారు.

కాలువలకు నీరు విడుదల


తూములు ఎత్తుతున్న రైతులు

శింగనమల: రబీ కింద వరి పంటను సాగు చేయడానికి బుధవారం శింగనమల చెరువు కింద కాలువలకు సాగునీటి పారుదల సంఘం ఆధ్వర్యంలో రైతులు నీరు విడుదల చేశారు. చెరువు కింద శింగనమల, శివపురం, సి.బండమీదపల్లి, పోతురాజుకాల్వ , సోదనపల్లి గ్రామాలకు చెందిన రైతులు వరి పంటను సాగు చేసుకోవడానికీ ముందుకు వచ్చారు. దీంతో కాలువలకు నీరును విడుదల చేయడానికీ పూజలు చేసి, తూములు ఎత్తారు. కార్యక్రమంలో సాగునీటి పారుదల సంఘం సభ్యులు , రైతులు పాల్గొన్నారు.

శతాబ్ది ఉత్సవాలు జయప్రదం చేయండి

గార్లదిన్నె: భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలని సీపీఐ నాయకులు శ్రీనాథ్‌చౌదరి కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ సీపీఐ మండల సమితి ఆధ్వర్యంలో గురువారం కనంపల్లి, పెనకచెర్ల, పెనకచెర్లడ్యాం, మర్తాడు, కమలాపురం, పి.కొత్తపల్లి, కల్లూరు గ్రామాల్లో ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తామని, పార్టీ నాయకులు హాజరై విజయవంతం చేయాలన్నారు.

పారిశుధ్య కార్మికుల వినూత్న నిరసన


మున్సిపల్ కార్యాలయం వద్ద రోదిస్తూ నిరసన తెలుపుతున్న కార్మికులు

గుంతకల్లు: తమ సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికులు రోదిస్తూ బుధవారం వినూత్న నిరసనకు దిగారు. వారికి ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు. ఏఐటీయూసీ నాయకుడు ఎం.వీరభద్రస్వామి, మున్సిపల్ కార్మిక సంఘం అధ్యక్షుడు చిన్న కొండయ్య, సీఐటీయూ నాయకులు నరసయ్య, జగదీష్ మాట్లాడుతూ కార్మికులకు పనిముట్లును సక్రమంగా ఇవ్వడం లేదన్నారు. కార్మికులు లీవులు వాడుకుంటే జీతంలో కోత పెడుతున్నారన్నారు. సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం పెద్దఎత్తున మున్సిపల్ ధర్నా చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి గోపీనాథ్, నాయకులు ప్రేమ్‌కుమార్, అరుణ, ఏసు, దాసు, పెద్ద పెంచలయ్య, రామాంజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

లోక రక్షకుడు ఏసు క్రీస్తు

ఏసు క్రీస్తు లోక రక్షకుడని పాస్టర్లు, దైవజనులు కొనియాడారు. తాడిపత్రి, గుంతకల్లు, శింగనమల నియోజకవర్గాల్లో బుధవారం క్రిస్మస్ వేడుకలు మిన్నంటాయి. ఈ సందర్భంగా క్రైస్తవులు ఉదయాన్నే చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరినొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పిల్లలు నృత్యాలు, భక్తులు ఆలపించిన క్రిస్మస్ గీతాలు ఆకట్టుకున్నాయి. పిల్లల శాంతాక్లాజ్ వేషధారణ అలరించింది. ఈ సందర్భంగా మిరిమిట్లుగొలిపే విద్యుత్ కాంతులతో వెలిగిపోతున్న ప్రార్థనా మందిరాలు పండుగకు ప్రత్యేకత తీసుకొచ్చాయి. చర్చిలలో క్రిస్మస్ ట్రీలు ముచ్చటగొలిపాయి. పాస్టర్లు క్రీస్తు జన్మించిన విశేషాలను వివరించారు. అనంతరం కేక్ కట్ చేసుకుని సంబరాలు చేపట్టారు. అనంతరం పేదలకు చీరలు, దుస్తులు పంపిణీ చేశారు.

- భక్తిశ్రద్ధల నడుమ క్రిస్మస్ వేడుకలు
- కిటకిటలాడిన చర్చిలు


తాడిపత్రిలో ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు


గుంతకల్లులో ఆరోగ్యమాత చర్చిలో కేక్ కట్ చేస్తున్న పాస్టర్ ప్రతాప్‌రెడ్డి, రవి

తాడిపత్రి అర్బన్: క్రిస్మస్ సందర్భంగా మంగళవారం అర్ధరాత్రి నుండే పట్టణంలోని చర్చిలు ప్రత్యేక వేడుకలతో కళకళలాడాయి. బుధవారం తెల్లవారుజాము నుంచి క్రైస్తవులు పెద్దఎత్తున చర్చిలకు చేరుకుని ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఆర్సీఎం చర్చిలో ఉదయం 6.30 గంటలకు ఇంగ్లీష్‌లో హోలీ మాస్ ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం తెలుగు ప్రార్థనలు జరిపారు. ఫాదర్లు డేవిడ్ అరులప్ప,రాజశేఖర్ కేక్‌ను కట్ చేశారు. అనంతరం భక్తులకు దేవుడి సందేశాన్ని వినిపించారు. అలాగే సీఎస్ఐ చర్చిలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి.

గుంతకల్లు టౌన్: గుంతకల్లు పట్టణంలో బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాయలసీమలో పేరు గాంచిన ఆరోగ్యమాత (ఆర్‌సీఎం), ఎస్‌పీజీ (గంట చర్చి), సీఎస్ఐ, బెయెర్షబా చర్చిలతో పాటు ఇతర ప్రార్థనా మందిరాల్లో వేకువజామున నుండే సామూహిక ప్రార్థనలు చేశారు. పాస్టర్లు క్రీస్తుతత్వాన్ని బోధించి ఆయన ప్రేమ, కరుణ కోసం ప్రత్యేక గీతాలతో స్తుతించారు. ఏసు క్రీస్తు లోకరక్షకుడని, అందరి కోసం మానవ స్వరూపంగా ఈ లోకంలో జన్మించారన్నారు. ఆయా చర్చిల్లో వందలాది మంది క్రైస్తవులు ప్రార్థనల్లో పాల్గొని అనంతరం పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చిన్నారులు శాంతాక్లాజ్ వేషధారణల్లో ఆకట్టుకున్నారు. శాంతాక్లాజ్‌ల నుంచి బహుమతులు స్వీకరించారు. ఆర్‌సీఎం చర్చిలో పాస్టర్లు ప్రతాప్‌రెడ్డి, రవిలు కేక్ కట్ చేశారు. ఎస్‌పీజీ చర్చి పాస్టర్లు ఎస్.జాన్, ప్రసన్నబాబులు తదితరులు భక్తులకు ఆశీర్వాదాలు అందజేశారు. అలాగే ఆలూరు రోడ్‌లోని సీఐటీయూ కాలనీ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జెమ్స్ 'గ్రేస్ ఎండియర్‌మెంట్ మిషన్ సర్వీసెస్) అధినేత స్టీఫెన్ జోసెఫ్ అల్పాహార విందు, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. పేదలకు దుస్తులు, ఇంటి సామగ్రిని అందజేశారు. జెమ్స్ ప్రతినిధులు డిసి.శేఖర్, సామెల్, సుసన్, సీమెన్స్, హెడ్రిక్ రాజ్‌కుమార్, ఉదయ్, సీపీఎం పట్టణ కార్యదర్శి మారుతి తదితరులు పాల్గొన్నారు.

గుత్తి: గుత్తిలోని బైబిల్ మిషన్ చర్చి, సీఎస్ఐ టౌన్ చర్చి, బండగేరిలోని లార్డ్ జీసస్ చర్చి, బేతస్త ప్రార్థనా మందిరం, ఆర్ఎస్‌లోని సీఎస్ఐ చర్చితో పాటు సుమారు 20 చర్చిలలో క్రిస్మస్ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. బైబిల్ మిషన్ చర్చి(అద్భుత కుమార్)లో పాస్టర్ రెవరెండ్ అద్భుత కుమార్, మణికుమారి దంపతులు, గుత్తి సీఎస్ఐ చర్చిలో పాస్టర్ సాల్మోన్, ఆర్ఎస్‌లోని సీఎస్ఐ చర్చిలో పాస్టర్ మోహన్ , లార్డ్ జీసస్ చర్చిలో పాస్టర్ వైపీ బాబు, బేతస్త ప్రార్థనా మందిరంలో బిషప్ అనిల్ కాంత్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాగే గుత్తిలోని లార్డ్ జీసస్ చర్చి, సీఎస్ఐ టౌన్ చర్చిలలో పేదలకు చీరెలు పంపిణీ చేశారు.

గుత్తి రూరల్: మండల కేంద్రంతోపాటు బాచుపల్లి, అబ్బేదొడ్డి, ఊబిచెర్ల, రజాపురం, కొత్తపేట, ఇసురాళ్లపల్లి, లచ్చానుపల్లి గ్రామాల్లో క్రైస్తవులు క్రిస్మస్ పండుగ ఘనంగా నిర్వహించారు. ఉ బాచుపల్లి చర్చిలో పాస్టర్ వాసు అనిల్‌కాంత్ ప్రత్యేక ప్రార్థనలు చేసి అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

పామిడి: మండలంలోని చర్చీలలో బుధవారం క్రిస్మస్ పండుగ ఘనంగా నిర్వహించారు. స్థానిక సీఎస్ఐ చర్చీలో పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్ క్రిస్మస్ సందేశాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో చర్చి సభ్యులు, క్రైస్తవులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: మండలంలోని పెద్దవడుగూరు. చిన్నవడుగూరు, దిమ్మగుడి, రావులుడికి, క్రిష్టిపాడు, గుత్తి అన ంతపురం తదితర గ్రామాల్లో క్రిస్మస్ సంబరాలు మిన్నంటయిరు. క్రీస్తు జీవిత చరిత్రను పాస్టర్ జాన్‌డేవిడ్ వివరించారు. కార్యక్రమంలో ఇమ్మానుయేల్, శోభారాణి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

యాడికి: మండల వ్యాప్తంగా 13 ప్రధాన చర్చిల్లో క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలు నిర్వ హించారు. మండల కేంద్రంలోని సీఎస్ఐ చర్చిలో పాస్టర్ జయరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిసమస్ వేడకలకు అధిక సంఖ్యలో క్రైస్తవులు హాజరయ్యారు.

చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు

శింగనమల: మండలంలోని శింగనమల, సోదనపల్లి, సలకంచెర్వు, నిదనవాడ, రాచేపల్లి, తరిమెల, కల్లుమడి, లోలూరు, సి.బండమీదపల్లి, పెరవలి, చిన్నమట్లగొంది, ఆనందరావుపేట, గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. చర్చిలలో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

గార్లదిన్నె: మండలంలో నివివిధ గ్రామాల్లో బుధవారం క్రైస్తవులు క్మిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్లు క్రై స్తవులకు దైవ సందేశాన్ని అందించారు.

యల్లనూరు: ఏసు క్రీస్తు జన్మదిన వేడుకలను యల్లనూరు, వెన్నపూసపల్లి, పెద్దమల్లేపల్లి, నిట్టూరు తదితర గ్రామాల్లో క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి నుంచి బుధవారం మధ్యాహ్నం వరకూ టీసీసీ ఫాదర్లు రుబిన్‌బాబు జీసస్ గ్లోరీ చర్చి ప్రకాష్‌బాబు క్రీస్తు ప్రార్థనలు చేశారు.

బుక్కరాయసముద్రం: మండలంతోపాటు పలు గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు క్రైస్తవులు గనంగా నిర్వహించారు. మండల కేంద్రలోని హైస్కూల్ కొట్టాలలో ఎల్‌షద్దాయి చర్చిలో వ్యవస్థాపకుడు ప్రతాప్‌కుమార్ క్రీస్తు సందేశం వినిపించారు. కార్యక్రమంలో ఎస్ఐ శేషగిరి, జమిదార్ నవీన్, బాషా, భాస్కర్, కుమార్ స్వామి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.


శింగనమల చర్చిలో ప్రార్థనలు నిర్వహిస్తున్న పాస్టర్ డానియల్


తాడిపత్రిలో ప్రత్యేక ప్రార్థన చేస్తున్న పాస్టర్లు


గుంతకల్లులో ఎస్‌పీజీ(గంట)చర్చిలో ప్రార్థనలు జరిపిస్తున్న పాస్టర్ ఎస్.జాన్


గుంతకల్లులో సీఎస్ఐ చర్చిలో క్రీస్తు సందేశం వినిపిస్తున్న దృశ్యం


గుంతకల్లులో భోజనాలు వడ్డిస్తున్న జెమ్స్అధినేత, పాస్టర్ స్టీఫెన్ జోసెఫ్


పామిడిలోని సీఎస్ఐ చర్చీలో సాంస్కృతిక కార్యక్రమం


పామిడి సీఎస్ఐ చర్చీలో ప్రసంగిస్తున్న పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్



గుత్తిలోని బైబిల్ మిషన్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న పాస్టర్ రెవరెండ్ అద్భుత కుమార్


గుత్తి సీఎస్ఐ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న పాస్టర్ సాల్మోన్


గుత్తిలోని లార్డ్ జీసస్ చర్చిలో చీరలు పంపిణీ చేస్తున్న పాస్టర్ వైపీ బాబు


గుత్తిలోని చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు


యల్లనూరులో జీసస్ గ్లోరీ చర్చిలో ఫాదర్ ప్రకాష్‌బాబుతో కేక్ కట్ చేయిస్తున్న భక్తులు


గార్లదిన్నె మండలం మర్తాడులోని మిష్పాగ్రేస్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు


పెద్దవడుగూరు ఐఎన్ఈసీ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న దృశ్యం


యాడికిలో సీఎస్ఐ చర్చిలో వేడుకలు నిర్వహిస్తున్న పాస్టర్ జయరాజ్


బీకేఎస్‌లో కేక్ కట్ చేస్తున్న ఫాదర్ ప్రతాప్‌కుమార్

ఘనంగా వాజ్‌పేయి శత జయంతి


గుంతకల్లులో వాజ్‌పేయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు


పామిడిలో వాజ్‌పేయ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం


యాడికిలోని వృద్ధాశ్రమంలో వాజ్‌పేయి జయంతి నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్/పామిడి/యాడికి: గుంతకల్లు పట్టణంలోని ఇల్లూరు లక్ష్మీనారాయణ భవన్‌లో వాజ్‌పేయి శతజయంతి వేడుకలను బుధవారం బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు వడ్డే రమేష్, నగర ఉత్సవ సమితి కోశాధికారి ఇల్లూరు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వాజ్‌పేయి ఆశాయలను కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కొలిమి రామాంజి, ప్రధాన కార్యదర్శి విశ్వనాథ్, నాయకులు పురంధర్, శేకన్న, రంగన్న, విజయలక్ష్మి, కేశవ, లక్ష్మీనారాయణ, పద్మ, తదితరులు పాల్గొన్నారు. అలాగే పామిడి పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన వాజ్‌పేయి జన్మదిన వేడుకల్లో ఆ పార్టీ నాయకులు చౌహాన్ అంజి నాయక్, పూజారి లక్ష్మీదేవి, శ్రీధర్, మనోజ్‌కుమార్, రాజశేఖర్‌గౌడ్, రామ్‌నరేష్, మంజునాథ్‌రావు, అమర్నాథ్‌రెడ్డి, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు. అలాగే యాడికి మండల కేంద్రంలోని చవ్వా అశ్వర్థమ్మ వృద్ధాశ్రమంలో నిర్వహించిన మాజీ ప్రధాని వాజ్‌పేయి జయంతి వేడుకలో ఆ పార్టీ తాలూకా కన్వీనర్ గంగా ధర్, మండల కన్వీనర్ చౌడయ్య, ఆశ్రమ మేనేజర్ బాలయ్య, నాయకులు పాల్గొన్నారు.

నేడు రెవెన్యూ సదస్సు

యల్లనూరు/గార్లదిన్నె: యల్లనూరు మండలంలోని బుక్కాపురం, అరవేడు గ్రామాల్లో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ రాజా బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే గార్లదిన్నె మండలంలోని కనంపల్లిలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఈరమ్మ బుధవారం తెలిపారు.

సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలిగా నిర్మల



గుత్తి: పట్టణానికి చెందిన సీపీఎం నాయకురాలు నిర్మల ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యురాలిగా ఎంపికైంది. ఈ మేరకు సీపీఎం రాష్ట్ర కమిటీ నాయకులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదవిని బాధ్యతగా భావించి పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

టీడీపీ నాయకుల మధ్య ఘర్షణ

గుంతకల్లు: పట్టణంలో టీడీపీ నాయకుల మధ్య బుధవారం రాత్రి ఘర్షణ చేటుచేసుకుంది. ఓ వర్గంపై మరో వర్గం రాళ్లతో దాడి చేయడంతో ముగ్గురు గాయపడ్డారు. ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. మూడు రోజులు క్రితం టీడీపీ సీనియర్ నాయకుడు రామన్నచౌదరి, వాల్మీకి వర్గానికి చెందిన లింగ మధ్య కుల వివాదం చేటు చేసుకుంది. దీంతో బుధవారం రాత్రి మరోసారి ఈ విషయమై స్థానిక ఎస్ఎల్‌వీ థియేటర్ సమీపంలో పంచాయితీ జరగడంతో ఇరువర్గాల మధ్య వివాదం చోటు చేసుకుంది. అక్కడ మొదలైన వివాదం బస్టాండ్ సమీపంలోని రాగం హోటల్ వద్దకు చేరింది. దీంతో రామన్నచౌదరి వర్గానికి చెందిన పలువురు రాళ్లతో దాడి చేయడంతో లింగకు మద్దతుగా వచ్చిన మూర్తి, శేఖర్, రాజు గాయపడ్డారు. విషయం తెలుసుకున్న వన్‌టౌన్, టూటౌన్ పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువర్గాల వారిని టూటౌన్ పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఘర్షణకు గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

బేల్దారి మృతి

గుత్తి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన బేల్దారి చికిత్స పొందుతూ మృతిచెందాడు. వివరాలు.. పట్టణంలోని జెండా వీధి సమీపంలో గత సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని గాంధీ నగర్‌కు చెందిన బేల్దారి శ్రీరాములు తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. అయితే కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి శ్రీరాములు మృతి చెందినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

రజక కార్పొరేషన్ డైరెక్టర్‌కు సన్మానం


పరమేష్‌ను సన్మానిస్తున్న రజకులు

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లో బుధవారం రజక కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పరమేష్‌ను రజక సంఘం నాయకులు, సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పరమేష్ మాట్లాడుతూ రజకుల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో రజక సంఘం మండల నాయకులు నాగప్ప, రామాంజి, సూరి, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు


గాయపడిన శివరాజ్

తాడిపత్రి రూరల్: మండలంలోని వెంకటాంపల్లి రైల్వే గేట్‌ను ఢీకొని శివరాజ్(25)కు గాయాలయ్యాయని పోలీసులు తెలిపారు. తుమ్మలపెంటకు చెందిన శివరాజ్ మోటర్ సైకిల్ పై బుధవారం తాడిపత్రికి వస్తూ రైల్వే గేట్‌ను ఢీకొన్నాడన్నారు. గాయపడిన శివరాజ్‌ను 108 వాహనంలో తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని పోలీసులు తెలిపారు.

ఐదుగురిపై కేసు నమోదు

గార్లదిన్నె: మండలంలోని కనంపల్లికి చెందిన మహిళపై అదే గ్రామానికి చెందిన ఐదుగురు దాడి చేసినట్లు ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపారు.బుధవారం ఎస్ఐ మాట్లాడుతూ గ్రామానికి చెందిన నల్లక్క తమ్ముడు డబ్బుల విషయంలో అదే గ్రామానికి చెందిన వారితో మంగళవారం రాత్రి ఘర్షణ పడ్డాడు. ఈ సందర్భంగా నల్లక్క కలుగజేసుకుని ఘర్షణ పడవద్దని వారించడంతో.. ఐదుగురు ఆమెపై దాడి చేశారు. ఈ ఆమె ఫిర్యాదు మేరకు విచారణ చేసి, ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పైపులైన్ లీకేజీ కనిపించదా?


విద్యుత్ స్తంభం వద్ద లీకేజీ అవుతున్న నీరు


కలుషిత నీరు గ్రామానికి సరఫరా అవుతున్న దృశ్యం

యల్లనూరు: తాగునీరు కలుషితమవుతున్నా పట్టించుకునేవారు లేరు. మండలంలోని పి.ఎం.కొండాపురంలో తాగునీటి పైపులైన్‌కు రంధ్రం పడడంతో వారం రోజులుగా కలుషిత తాగుతున్నామని ప్రజలు వాపోతున్నారు. ఇటీవల పాత విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్త స్తంభాలను ఏర్పాటు చేసేందుకు గుంతలు తీస్తుండగా పక్కనే ఉన్న పైపులైన్‌కు రంధ్రం పడింది. దీంతో నీరు కలుషితమై రోగాల బారిన పడుతున్నామని గ్రామస్తులు వాపోయారు. పైపులైన్లకు రంధ్రాలు పడినా విద్యుత్ కాంట్రాక్టర్ మదన్‌మోహన్ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే గ్రామంలో విద్యుత్ నియంత్రిక ఏర్పాటు విషయంలోనూ రైతులకు అనుకూలంగా కాకుండా వరి, మొక్కజొన్న కోసే యంత్రాలు పొలాల్లోకి రాకుండా అడ్డంగా నూతన విద్యుత్తు నియంత్రికను ఏర్పాటు చేశారు. కాంట్రాక్టర్ స్పందించి పైపులైన్‌కు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

బీమా గడువు పొడిగింపు

గార్లదిన్నె: రబీ పంటల బీమా ఈ నెల 31 వరకూ పొడిగించినట్లు మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్ తెలిపారు. బుధవారం ఏఓ మాట్లాడుతూ రబీలో బ్యాంకులో పంట రుణాలు తీసుకున్న రైతులు కామన్ సర్వీస్ సెంటర్, మీసేవలో బీమా ప్రీమియం చెల్లించాలన్నారు. పప్పుశనగకు రూ.450, వేరుశనగకు రూ.480, జొన్నకు రూ.315, మొక్కజొన్నకు రూ.525, టమాటకు రూ.1600, వరికి రూ.630, మామిడికి రూ. 1650 పీమ్రియంగా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ప్రకృతి వైపరీత్యాలు వల్ల పంట నష్టం జరిగితే పంటల బీమా వస్తుందన్నారు.